




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 181 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం ఆదివారం 12 జూలై 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 181 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM SUN 12 JULY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## 40 ఏళ్ల నిరీక్షణకు తగిన ఫలం.. మోదీ రాక చరిత్రాత్మకం



- 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న భారత ప్రధానిగా మోదీ ఘనత
- మోదీ రాక కోసం ఎదురుచూశామని, ఇది చరిత్రాత్మకమని వ్యాఖ్యానించిన కివీస్ ప్రధాని
- మోదీ నాయకత్వంలో భారత్ అద్భుత ప్రగతి సాధించిందని ప్రశంస
- 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశారని కొనియాడిన లక్సన్
- 21వ శతాబ్దం భారత్‌దేనని, కలిసి పనిచేస్తామని స్పష్టీకరణ

- మిగతా 2లో

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే



- ఏఐ యుద్ధాలు చేసినా గెలిచేది సైనికులేనన్న రాజ్‌నాథ్
- విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి నౌకాదళంలోకి ప్రవేశం
- సంప్రదాయ, ఆధునిక సైనిక శక్తి మధ్య సమతుల్యం అవసరం
- యుద్ధనౌకల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు
- 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'తో ప్రపంచ హబ్‌గా భారత్

పెన్ పవర్ డెస్క్:ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ,

- మిగతా 2లో



## "పల్లి పల్లి మినిస్టర్"..

### విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన

- వారం రోజుల్లో 50కి పైగా కంపెనీలతో పెట్టుబడుల కోసం చర్చలు
- ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్ వంటి దిగ్గజ సంస్థల సానుకూల స్పందన
- బుసాన్‌లో ఏపీ పెట్టుబడిదారుల సహాయక కేంద్రాన్ని ప్రారంభించిన లోకేష్
- లోకేశ్ వేగాన్ని చూసి 'పల్లి పల్లి' (త్వరగా త్వరగా) మంత్రి అని ప్రశంసించిన కొరియన్లు

- మిగతా 2లో



## ఆ హంతకుడికి జగన్‌కి దగ్గరి పోలికలు ఉన్నాయి

- వైసీపీకి రాజకీయ పార్టీ లక్షణాలు లేవన్న సీఎం చంద్రబాబు
- గొడ్డలి, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ ప్రధాన అస్త్రాలని విమర్శ
- కడప స్టీల్ ప్లాంట్ పేరుతో లక్షల కోట్ల సంపద ఆవిరైందని ఆరోపణ
- తెలంగాణ ఆరు హత్యల హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి దగ్గరి పోలికలున్నాయని వ్యాఖ్య
- సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టుల కట్టడికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్: వైసీపీకి ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఏమాత్రం లేవని, అదొక గొడ్డలి పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గొడ్డలి, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ అస్త్రాలని, వారి చరిత్ర మొత్తం రక్త చరిత్రేనని విమర్శించారు. తెలంగాణలో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి చాలా దగ్గరి

- మిగతా 2లో

### వియత్నాంలో ఘోర ప్రమాదం..

## ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక...

# 15 మంది మృతి



- వియత్నాంలో భారత పర్యాటకులతో వెళ్తున్న స్పీడ్‌బోట్ బోల్తా
- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం

వివరాలు 2లో..




వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్‌బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ దీవి సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం కారణంగా ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.

| | |
|---|---|
| మృతి చెందిన వారు | 15 మంది |
| రక్షించిన వారు | 21 మంది (గాయాలు) |
| గల్లంతైన వారి కోసం | గాలింపు కొనసాగుతుంది |

**వివరాలు**

- ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు.
- వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు.
- మృతుల్లో మచిలీపట్నంకు చెందిన గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు.
- గిల్లి కిశోర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

**రంగంలోకి దిగిన సహాయక బృందాలు**

- స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.
- ఇప్పటివరకు లిలి21 మందిని రక్షించారులిలి.
- క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు.
- గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.



**భారత ఎంబసీ ప్రకటన**

ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపింది. బాధితుల కుటుంబాలకు సహాయం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది.

భారత రాయబార కార్యాలయం వియత్నాం

**హెల్ప్‌లైన్ నంబర్లు**

| | | | |
|---|---|---|---|
| +84 36 281 7930 | +84 91 552 37 14 | +84 33 452 0414 | +84 91 308 9165 |
| హో చి మిన్ సిటీ | హో చి మిన్ సిటీ | హనోయ్ | హనోయ్ |

భారతీయ పర్యాటకులు ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



## హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు

### జగన్ భీమవరం పర్యటనపై పేర్ని నాని

- జగన్ భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదన్న పేర్ని నాని
- హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే జగన్ రైలు ఎక్కైనా వస్తారని వ్యాఖ్య
- ఆక్వా రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ

- మిగతా 2లో

## ధవళేశ్వరం మరింత పటిష్ఠం...

### కొత్తగేట్లు అమర్చే పనుల్ని ఈనెల 13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



- ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటుకు శ్రీకారం
- రూ.153 కోట్లతో 117 పాత గేట్ల స్థానంలో కొత్తవి
- ఈనెల 13న పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- పిచ్చుకలంకలో రైతులతో భేటీ, పోలవరం ప్రాజెక్టు పరిశీలన
- సీడబ్ల్యూసీ సిఫార్సుల మేరకు బ్యారేజీ ఆధునీకీకరణ

పెన్ పవర్ డెస్క్: ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడిగా, లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ ఆధునికీకరణకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాలం చెల్లిన పాత గేట్ల స్థానంలో కొత్తవి అమర్చే పనులను ఈ నెల 13న ముఖ్యమంత్రి

- మిగతా 2లో

## గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

- తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్
- హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు

- మిగతా 2లో

## బెంగాల్‌లో సౌరవ్ గంగూలీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం.. రూ.2,500 కోట్ల ప్రాజెక్టులో జాప్యం



- పశ్చిమ బెంగాల్‌లో సౌరవ్ గంగూలీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం ఆలస్యం
- గతంలో ఆయన చెప్పిన గడువు సమీపిస్తున్నా ప్రారంభం కాని ఉత్పత్తి
- రూ.2,500 కోట్ల పెట్టుబడితో కెప్టెన్ స్టీల్‌తో కలిసి ఈ ప్లాంట్ నిర్మాణం
- ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 6,000 ఉద్యోగాలు వస్తాయని అంచనా

పెన్ పవర్ డెస్క్:భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన భారీ ఉక్కు పరిశ్రమ (స్టీల్ ప్లాంట్) నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది. గంగూలీ గతంలో ప్రకటించిన గడువు సమీపిస్తున్నప్పటికీ, వాణిజ్యపరమైన ఉత్పత్తి ఇంకా ప్రారంభం కాలేదు. పశ్చిమ మిడ్నాపూర్

- మిగతా 2లో



## మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

### మొజ్తబా ఖమేనీ ప్రకటన

- తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ప్రతిజ్ఞ
- అమెరికా-ఇజ్రాయెల్ దాడిలోనే తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం
- హంతకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని టెలిగ్రామ్‌లో హెచ్చరిక
- ఫిబ్రవరి దాడిలో గాయపడిన మొజ్తబా.. తండ్రి అంత్యక్రియలకు దూరం

- మిగతా 2లో

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

- రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ సార్దన్
- రాష్ట్రానికి ఎమిరేట్స్ సేవలను పెంచాలని కోరిన రేవంత్
- రాష్ట్రానికి రెండు కొత్త విమానాశ్రాయాలు వస్తున్నాయని చెప్పిన సీఎం

- మిగతా 2లో




## లెజెండరీ సింగర్ ఎస్. జానకి కన్నుమూత

పెన్ పవర్ డెస్క్: సినీ సంగీత పరిశ్ర మలో తీవ్ర విషాదం నెలకొంది. లెజెండరీ సింగర్ ఎస్. జానకి కన్నుమూశారు. గతకొంత కాలం గా వయోభారం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతోన్న ఆమె ప్రస్తుతం మైసూర్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఆ హంతకుడికి జగన్‌కి దగ్గరి పోలికలు ఉన్నాయి

- మొదటి పేజి తరువాయి

పోలికలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు.

**ఒక వ్యక్తి దాహానికి లక్షల కోట్ల సంపద ఆవిరి**

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కడప స్టీల్ ప్లాంట్ పేరుతో ఒక వ్యక్తి అవినీతి దాహానికి లక్షల కోట్ల విలువైన సహజ సంపద ఆవిరైందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బ్రహ్మణీ స్టీల్స్‌కు కేటాయించిన భూములను ప్రభుత్వం ఇప్పటికే వెనక్కి తీసుకుందని, అయితే ఓబులాపురం మైనింగ్ అంశం ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. జగన్, ఆయన కుటుంబం వల్ల ఎందరో ఐఏఎస్ అధికారులు బలయ్యారని, ఎంతోమంది వ్యాపారవేత్తలు సర్వనాశనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా పెట్టుబడులు పెట్టేవారిని బెదిరించి, పరిశ్రమలను తరిమేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే భయంతోనే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని అన్నారు.

**హిట్, రన్ అండ్ ఎస్కేప్ వారి నైజం**

వైసీపీ నైజాన్ని చంద్రబాబు 'హిట్, రన్ అండ్ ఎస్కేప్'గా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక విధ్వంసం సృష్టించి, పక్క రాష్ట్రంలోని బెంగళూరులో తలదాచుకోవడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననాలకు, మహిళలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకుంటున్నారని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఫేక్ పోస్టులను కట్టడి చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం రైతుల భూములను 22ఏ జాబితాలో పెట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తోందని హామీ ఇచ్చారు.

**ఆ హంతకుడికి, జగన్‌కు దగ్గరి పోలికలు**

ఈ సందర్భంగా తెలంగాణలో జరిగిన ఓ దారుణ ఘటనను ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో ఓ వ్యక్తి తనపై పోక్సో కేసు పెట్టిందన్న కక్షతో బాధితురాలితో పాటు ఆమె కుటుంబాన్ని, తనకు సహకరించలేదని సొంత కుటుంబాన్ని కూడా కిరాతకంగా హత్య చేశాడు. అటువంటి సైకో మనస్తత్వానికీ, సొంత బాబాయిని చంపడం, కన్నతల్లి, చెల్లి విషయంలో జగన్ ప్రవర్తించిన తీరుకూ చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి" అని అన్నారు. వైసీపీ నేర ప్రవృత్తిని, దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాల్సిన బాధ్యత మీడియాపై ఉందని సూచించారు. భోగాపురం విమానాశ్రయం, పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తికావస్తుండటంతో గొడ్డలి పార్టీలో టెన్షన్ మొదలైందని చంద్రబాబు పేర్కొన్నారు.

## ధవళేశ్వరం మరింత పటిష్ఠం... కొత్తగేట్లు అమర్చే పనుల్ని ఈనెల 13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ బృహత్ కార్యక్రమం ద్వారా బ్యారేజీని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ముందడుగు వేసింది.

బ్యారేజీ గేట్లను నిర్మించి 50 ఏళ్లు దాటడంతో వాటి సర్వీస్ లైఫ్ ముగిసిందని, వాటిని మార్చాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గతంలోనే సిఫార్సు చేసింది. ఈ సూచనల మేరకు, ప్రస్తుత ప్రభుత్వం బ్యారేజీ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆధునికీకరణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. మొత్తం రూ.152.95 కోట్ల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా, శిథిలావస్థకు చేరిన 117 ఫ్లడ్ గేట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను బిగించనున్నారు. దీంతోపాటు, 12 హెడ్ స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు, 175 క్రెస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ అమర్చనున్నారు. బీఈసీఓఎమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పనులను దక్కించుకోగా, రెండేళ్లలో పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించనుంది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం చూపిందన్న విమర్శలు ఉన్నాయి. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని, ధవళేశ్వరం బ్యారేజీ విషయంలోనూ కనీస మరమ్మతులు చేపట్టలేదని ఆరోపణలు వచ్చాయి. అయితే, 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులు చేయించింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఆధునికీకరణకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఈ నెల 13న ఉదయం 10:25 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11:25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నూతన గేట్ల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 11:45 గంటలకు ఆత్రేయాపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:20 గంటలకు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. అక్కడ ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5:20 గంటలకు పోలవరం పర్యటన ముగించుకుని తిరిగి అమరావతికి చేరుకుంటారు.

## బెంగాల్‌లో సౌరవ్ గంగూలీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం.. రూ.2,500 కోట్ల ప్రాజెక్టులో జాప్యం

- మొదటి పేజి తరువాయి

జిల్లాలోని గర్బేటాలో సుమారు రూ. 2,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ప్రముఖ టీఎంటీ బార్ల తయారీ సంస్థ 'కెప్టెన్ స్టీల్' భాగస్వామ్యంతో గంగూలీ ఈ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఏటా 8 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉంటుంది. దీనివల్ల కెప్టెన్ స్టీల్ సంస్థ మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 13 లక్షల టన్నులకు చేరుకోనుంది. 2025 ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్టు పురోగతిపై గంగూలీ మాట్లాడుతూ, "మేము స్టీల్ ప్లాంట్ నిర్మిస్తున్నాం. అయితే పనులు రెండు నెలల్లోనే పూర్తి కావాలని అందరూ ఆశిస్తారు, కానీ వాస్తవానికి అది సాధ్యం కాదు. దీనికి 18 నుంచి 20 నెలల సమయం పడుతుంది" అని పేర్కొన్నారు. అప్పటి నుంచి దాదాపు 17 నెలలు గడిచినప్పటికీ, ఉత్పత్తి ప్రారంభంపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. పర్యావరణ, కాలుష్య నియంత్రణ అనుమతులతో పాటు, 350 ఎకరాల భూసేకరణ వంటి ప్రక్రియల కారణంగానే ప్రాజెక్టులో కొంత ఆలస్యం జరుగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

వాస్తవానికి ఈ ప్రాజెక్టును తొలుత సాల్బోనిలో ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ, తదనంతర పరిణామాల వల్ల గర్బేటాకు మార్చారు. ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తొలి దశలో సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. గంగూలీకి ఉక్కు రంగంలో 2007 నుంచే ప్రవేశం ఉంది. ఇప్పటికే ఆయనకు అసన్‌సోల్, పాట్నాల్లో ఉన్న చిన్న తరహా స్టీల్ ప్లాంట్లలో పెట్టుబడులు ఉన్నాయి.

# వియత్నాంలో ఘోర ప్రమాదం.. ఏపీ, తెలంగాణ వాసులతో వె ళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది.స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.ఒక మొబైల్ కంపెనీ తరపున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది.ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది.

ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది. బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (+84 36 281 7930, +84 91 552 37 14, +84 33 452 0414, +84 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

# "పల్లి పల్లి మినిస్టర్".. విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన వారం రోజుల దక్షిణ కొరియా పర్యటన అద్భుతరీతిలో విజయవంతమైంది. భారత్-కొరియా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే క్రమంలో ఈ పర్యటన ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. దక్షిణ కొరియా విదేశాంగ శాఖ అధికారిక ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన ఈ పర్యటనలో మంత్రి లోకేశ్, ఆయన బృందం అక్కడి ప్రభుత్వ, పారిశ్రామిక వర్గాల నుంచి విశేష గౌరవాన్ని అందుకుంది.

**50కి పైగా కంపెనీలతో కీలక చర్చలు**

ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ 50కి పైగా కార్పొరేట్ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ముఖ్యంగా ఎల్జీ సంస్థ తమ ప్రధాన కార్యాలయానికి లోకేశ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నత స్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం ఈ పర్యటనకు లభించిన ప్రాధాన్యతను చాటుతోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై లోకేశ్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కొరియన్ కంపెనీల నుంచి అద్భుత స్పందన లభించింది. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నత యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయా సంస్థలు హామీ ఇచ్చాయి.

**బుసాన్‌లో 'అపెక్స్-కొరియా' సెల్ ప్రారంభం**

పెట్టుబడిదారులకు మరింత చేరువయ్యేందుకు, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కొరియాలోని ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో మంత్రి లోకేశ్ 'అపెక్స్-కొరియా' (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్-కొరియా) కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఈడీబీ ఆధ్వర్యంలో పనిచేసే ఈ ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కొరియన్ కంపెనీలకు ఒక వారధిగా పనిచేస్తుంది. ఇప్పటికే శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో 40కి పైగా కొరియన్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తుండగా, ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో మరిన్ని కంపెనీలు రాష్ట్రానికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. పర్యటన ప్రారంభంలో సియోల్‌లోని భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో భేటీ అయిన లోకేశ్, కొరియాలోని కీలక పరిశ్రమలను ఏపీకి తీసుకురావడంలో చొరవ చూపాలని కోరారు.

**'పల్లి పల్లి' మినిస్టర్ అంటూ ప్రశంసలు**

ఆంధ్రప్రదేశ్‌లో 'కియా' మోటార్స్ కేవలం రెండేళ్లలో సాధించిన అసాధారణ విజయాన్ని లోకేశ్ తన ప్రసంగాల్లో ఉదహరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న '3ఎస్' మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతుల విధానం కొరియన్లను అమితంగా ఆకట్టుకుంది. మంత్రి లోకేశ్ పని వేగాన్ని, చొరవను చూసి ముగ్ధులైన కొరియన్ ప్రతినిధులు ఆయన్ను 'పల్లి.. పల్లి మంత్రి' అని ముద్దుగా పిలుచుకున్నారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా త్వరగా' అని అర్థం.

లోకేశ్ బృందం పర్యటన అద్భుతమని కొరియా వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (కోట్రా) దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు.

# హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు

ఆక్వా రైతుల సమస్యలపై వైసీపీ అధినేత జగన్ చేపట్టబోయే భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం ఏ రకంగానూ అడ్డుకోలేదని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. ఒకవేళ హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే.. జగన్ రైలు ఎక్కైనా సరే భీమవరం వచ్చి రైతులను కలుస్తారని తేల్చిచెప్పారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని బువ్వనపల్లిలో ఈరోజు జరిగిన ఆక్వా రైతుల ఆత్మీయ సమావేశంలో పేర్ని నాని పాల్గొని మాట్లాడారు.న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో ఆక్వా రైతాంగం తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్ని నాని మండిపడ్డారు. ఆక్వా మేత ధరలు ఆకాశాన్నంటుతున్నా వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. మేత కంపెనీల యాజమాన్యాలు, పాలకులు చేతులు కలపడం వల్లే పెట్టుబడి వ్యయం పెరిగిపోయి రైతులు భారీ నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు.

ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు జులై 15వ తేదీన జగన్ భీమవరం రావడం ఖాయమైందని పేర్ని నాని వెల్లడించారు. ఈ పర్యటనను ఫ్లాప్ చేయడానికి లేదా అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, కుతంత్రాలు చేసినా జగన్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. "కూటమి ప్రభుత్వం హెలిప్యాడ్‌కు అనుమతులు నిరాకరిస్తే నిరాకరించుకోవచ్చు. జగన్ అవసరమైతే సామాన్యుడిలా రైల్లో ప్రయాణించి అయినా సరే ఇక్కడికి చేరుకుంటారు. రైతులను కలిసి వారి సమస్యలపై ప్రభుత్వం దిగివచ్చేలా పోరాడుతారు" అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, లేదంటే ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25వ వార్షికోత్సవాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఈ భేటీ జరిగింది. తెలంగాణలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం జరగబోతోందని... రాష్ట్రానికి ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరింత పెంచాలని ఈ సందర్భంగా సార్ధన్ ను రేవంత్ రెడ్డి కోరారు. దీంతో, హైదరాబాద్‌కు ఏ-380 విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపించింది.

ఎమిరేట్స్‌కు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్ అందించాలని రేవంత్ రెడ్డి కోరగా, ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు. త్వరలో తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలను నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విమాన సర్వీసులు పెంచాలని ఎమిరేట్స్ ను రేవంత్ కోరారు.

## 40 ఏళ్ల నిరీక్షణకు తగిన ఫలం.. మోదీ రాక చరిత్రాత్మకం

న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని తమ దేశంలో అడుగుపెట్టడం ఒక చరిత్రాత్మక ఘట్టమని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ అభివర్ణించారు. ప్రధాని మోదీ రాక కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నామని, ఈ నిరీక్షణకు తగిన ఫలం దక్కిందని ఆయన అన్నారు.ఆక్లాండ్‌లో ప్రవాస భారతీయులు నిర్వహించిన 'కియా ఓరా మోదీ' కార్యక్రమంలో లక్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ రోజు న్యూజిలాండ్ చరిత్ర సృష్టిస్తోంది. 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్ గడ్డపై నిలబడ్డారు. ఇది కుటుంబ సభ్యుల మధ్య చాలా సుదీర్ఘ విరామం. కానీ ప్రధాని మోదీ, ఐదు మిలియన్ల న్యూజిలాండ్ ప్రజల తరపున చెబుతున్నా.. మీ రాక మా నిరీక్షణకు తగినది" అని వ్యాఖ్యానించారు. 10,000 మందికి పైగా ప్రవాస భారతీయులతో కిక్కిరిసిన ఆడిటోరియంను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని ఎంతో మంది పెద్ద స్టార్లు ప్రదర్శనలిచ్చిన ఈ వేదికపై ఇంతటి ఉత్సాహభరిత వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ సాధించిన అద్భుత పరివర్తన తనను నివ్వెరపరిచిందని లక్సన్ కొనియాడారు. "గత దశాబ్ద కాలంలోనే మోదీ నాయకత్వంలో 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారు. ఇది ప్రపంచంలోనే మానవ గౌరవాన్ని నిలబెట్టిన గొప్ప విజయాలలో ఒకటి. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద మధ్యతరగతి వర్గాల్లో ఒకటైన 445 మిలియన్ల మంది భారత్‌లో ఉన్నారు. వారి ఆదాయాలు పెరిగి, ఉత్తమ జీవన ప్రమాణాలు అందుకుంటున్నారు" అని వివరించారు.భారత్ సాధించిన అభివృద్ధిని లక్సన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "మోదీ హయాంలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపై 157కి చేరింది. సుమారు 95,000 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారులు నిర్మించారు. అంతరిక్ష రంగంలోనూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండర్?ను దించిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది" అని గుర్తుచేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్రను నొక్కిచెప్పిన లక్సన్, త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని అన్నారు. "21వ శతాబ్దం భారత్‌దే. ఈ భవిష్యత్ నిర్మాణంలో భారత్‌తో కలిసి పయనించాలని న్యూజిలాండ్ కోరుకుంటోంది" అని ఆయన స్పష్టం చేశారు.

# మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. ఇది దేశ ప్రజల డిమాండ్ అని, తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా.. జులై 9న జరిగిన తన తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయారు. తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

- మొదటి పేజి తరువాయి

ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

## లెజెండరీ సింగర్ ఎస్. జానకి కన్నుమూత

- మొదటి పేజి తరువాయి

చికిత్స పొందుతున్నారు. శనివారం (జులై 11) ఆరోగ్యం విషమించడంతో ఆమె తుదిశ్వాస విడిచారు. జానకి మనువరాలు అప్సర వైద్యుల ఇన్స్?స్టా?గ్రామ్ వేదికగా ఈ విషయాన్ని ధృవీకరించారు. దీంతో భారతీయ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. తన అద్భుతమైన స్వరంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న గాన కోకిల జానకి మరణంపై పలువురు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

**ఎస్. జానకి బ్యాగ్రౌండ్:**

తన మధురమైన గాత్రంతో ఆరు దశాబ్దాల పాటు కోట్ల మంది శ్రోతలను మైమరపించిన గానకోకిల, దక్షిణ భారత నైటింగేల్ ఎస్. జానకి 1938, ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించారు. ఏ విధమైన శాస్త్రీయ సంగీతం నేర్చుకోకుండానే తన అద్భుత స్వరంతో ఆరు దశాబ్దాల పాటు సంగీత పరిశ్రమను ఏలారు. 1957లో తమిళ చిత్రం ద్వారా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె.. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీతో పాటు దాదాపు 17 భాషల్లో 48 వేలకు పైగా పాటలు పాడి సరికొత్త రికార్డు సృష్టించారు. తన అద్భుతమైన స్వరంతో 4 జాతీయ అవార్డులు, 32 వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు సాధించారు. చిన్న పిల్లల గొంతు నుంచి పండు ముసలి వారి వరకు.. ఎలాంటి పాత్రకైనా తన గొంతుతో ప్రాణం పోయడం ఆమె స్పెషాలిటీ. జానకి భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆమె పాడిన వేలాది పాటలు, ఆ మధుర స్వరం సంగీత ప్రియుల గుండెల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

- మొదటి పేజి తరువాయి

అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేడు విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు.

నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు.ఇటీవల కాలంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలు.. సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాలను సమర్థవంతంగా మేళవించగల భారత శక్తిని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఆత్మరక్షణకే కాకుండా అవసరమైనప్పుడు శత్రువుపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టి, వారిని పూర్తిగా నిర్మూలించగల సత్తా భారత్‌కు ఉందని ఈ ఆపరేషన్ రుజువు చేసిందని పేర్కొన్నారు.యుద్ధనౌకల నిర్మాణం కేవలం నౌకాదళాన్ని బలోపేతం చేయడమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఒక యుద్ధనౌక నిర్మాణం అంటే ఒక పరిశ్రమల వ్యవస్థను నిర్మించడమే. ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్ వంటి ఎన్నో రంగాలను ఇది ముందుకు నడిపిస్తుంది. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది, కొత్త టెక్నాలజీలు అభివృద్ధి చెందుతాయి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది" అని తెలిపారు.భారత్‌ను నౌకా నిర్మాణ రంగంలో గ్లోబల్ హబ్‌గా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'పై వేగంగా పనిచేస్తున్నామని చెప్పారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ వంటి పథకాల ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సెక్రెటరీ.



**గుమ్మలక్ష్మీపురం జూలై 11 పెన్ పవర్.** మండలంలో రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల పరిసరాలు మరియు రేగిడి గ్రామం చుట్టూ ఉన్న చెత్తను పంచాయతీ సెక్రెటరీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం నాడు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ కృష్ణారావు మాట్లాడుతూ, పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకొని ఉన్న చెత్తను జెసిపి సహాయంతో ట్రాక్టర్ తో డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్నామన్నారు. అలాగే రేగిడి గ్రామం చుట్టూ ఉన్న చెత్తను ట్రాక్టర్ సహాయంతో బయటకు తరలిస్తున్నామని. ఇప్పుడు ఉండేది వర్షాకాలం కావడంతో చెత్త వలన విద్యార్థులు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువలన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పార వేయకూడదని చెత్తబుట్టలో వేసుకోవలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అనంతరం రేగిడి గ్రామ ప్రజలకు పరిశుభ్రంపై అవగాహన కల్పిస్తూ మన ఇంటిని మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిరోజు శుభ్రం చేసిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లకు అప్పగించాలని, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడం వల్ల అనేక వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని సెక్రెటరీ కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహ వార్డెన్ జయలక్ష్మి, పాఠశాల సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు. గ్రామస్తులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# గ్రామసభ నిర్వహించి వాటర్ల జాబితా పరిశీలన

**జి.మాడుగుల. పెన్ పవర్. జూన్(11)** అల్లూరి సీతారామరాజు జిల్లా, జి, మాడుగుల మండలం ఈరోజు పాలమామిడి పంచాయతీ, చిన్న బంధావిదీ గ్రామం లో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఓటర్లు జాబితా లో ఓట్లు కోసం చర్చించడం జరిగింది.. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ సవరణ రాష్ట్రములో అన్నీ గ్రామలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాల్గొనడం జరుగుతుంది.. ప్రజలా కోసం నిరంతరం కష్టబడుతున్నా ప్రతిఒక్కరికి జనసేన పార్టీ గుర్తిస్తుందని జర్ర అంకిత్ తెలియజేసారు. అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి చేరేలే మేం కృషి చేస్తాం. అని అంకిత్ అన్నారు . ముఖ్య అతిథిగా జనసేన యువనాయకులు జర్రా అంకిత్ పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో తెరవాడ వెంకటరమణ, కొర్రా కమల్ వనబలంగి మోహన్ తాంగుల రమేష్, మరియు సచివాలయం సిబ్బంది గ్రామం లో వివిధ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు



# జీవో నంబరు 3 పునరుద్ధరణపై సీఎం స్పష్టత ఇవ్వాలి




- 1/70 చట్టం జోలికొస్తే చూస్తూ ఊరుకోం.
- 17న పాడేరులో జరిగే భారీ ధర్నాకు విజయవంతం చేయాలి.
- ఆదివాసి డీఎస్సీ సాధన కమిటీ,1/70 పరిరక్షణ కమిటీ ప్రజాసంఘాల డిమాండ్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 11.** షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసి గిరిజనులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నెంబర్ 3ను తక్షణమే పునరుద్ధరించాలని, దీనిపై రాష్ట్ర కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత ఇవ్వాలని, అదేవిధంగా 1/70 చట్టం ఆదివాసి ప్రాంతంలో పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కోకన్వీనర్ కూడ రాధాకృష్ణ, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ కోఆర్డినేటర్ వి జగన్, పెసా ఉపాధ్యక్షులు పి సుబ్బారావు, ఆదివాసి నిరుద్యోగుల సంఘం నాయకులు వి గోపాల్, లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం వారు ముంచంగిపుట్టులో మాట్లాడుతూ.. గతంలో సుప్రీంకోర్టు కొట్టి వేసిన జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. 2026 మెగా డీఎస్సీలో ఆదివాసీ నిరుద్యోగులు పూర్తిగా నష్టపోయిన పరిస్థితి ఉందనీ, 2024 ఎన్నికల ముందు అరకు సభలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా గిరిజన చట్టాల రక్షణపై స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. హామీలు నెరవేర్చకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 1/ 70 చట్టం రద్దు చేయాలని ఆదివాసేతరులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ అవ్వాలని, 1/ 70 చట్టం జోలికి ఎవరు వచ్చినా ఆదివాసులుగా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, జీవో నెంబర్ 3, మరియు 1/70 చట్టం పరిరక్షణ కోసం ఈనెల 17న పాడేరులో జరిగే భారీ ధర్నా కార్యక్రమానికి నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. 17న జరిగే ధర్నాకు వేలాది మంది ఆదివాసులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాంగి గోవింద్, లక్ష్మణ్, గణపతి, వేణుగోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**జీ.మాడుగుల పెన్ పవర్ జూన్ (11)** మండలం మత్స్యపురంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై సాయిరామ్ పడాల్ శనివారం తెలిపారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, పాముకాటుతో మృతి చెంది ఉండొచ్చన్నారు. మృతుడికి 45 - 50 ఏళ్ల వయసు ఉండొచ్చన్నారు. మృతుడు తమిళనాడుకు చెందిన జెమినిగా అనుమానిస్తున్నామన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు స్టేషన్లో సంప్రదించాలన్నారు.

# విశాఖ పశ్చిమలో రూ.1.80 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం





- కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీ, ప్రభుత్వ విప్
- 92, 90, 60, 40 వార్డుల్లో వరుస ప్రారంభోత్సవాలు
- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 11 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా సుమారు రూ.1.80 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన పలు కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ కార్యాలయ సముదాయాలను పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ మరియు ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు. పర్యటనలో భాగంగా తొలుత 92వ వార్డు శ్రీనుబాబునగర్లో రూ.17.30 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ హాల్ స్థానిక ప్రజలకు సామాజిక, సాంస్కృతిక, సామూహిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు. తదుపరి 90వ వార్డు ఇందిరా ప్రియదర్శిని కాలనీలో రూ.19.80 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం కాకానినగర్ వినోద్ నగర్లో రూ.14.20 లక్షల వ్యయంతో నిర్మించిన మరో కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అంకితం చేశారు. అదే వార్డు పరిధిలోని రజక కాలనీలో స్థానిక రజకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.49 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక ధోబీ ఘాట్‌తో కూడిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సదుపాయం ద్వారా రజక వృత్తిదారులకు మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కూడా అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం 60వ వార్డు వుడా కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన జీవీఎంసీ జోనల్ కార్యాలయం మరియు ఎంఆర్ఓ కార్యాలయం సముదాయాన్ని ప్రారంభించారు. ఈ నూతన కార్యాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవడంతో పాటు పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని అధికారులు పేర్కొన్నారు. చివరిగా 40వ వార్డు జై ఆంధ్ర కాలనీలో రూ.19.85 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించడంతో ప్రారంభోత్సవాల పర్యటన ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భరత్, ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ స్వామివారిని దర్శించుకున్న ఒడిశా రాష్ట్ర మంత్రి

- మంత్రి గోకులానంద మల్లిక్‌కు సింహాచలంలో ఆలయ మర్యాదలు
- శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు
- చిత్రపటంతో సత్కరించిన ఈవో



**సింహాచలం, పెన్ పవర్, జూలై 11 :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారిని ఒడిశా రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి గోకులానంద మల్లిక్ శనివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆయనకు దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి గోకులానంద మల్లిక్‌కు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయంలో అత్యంత పవిత్రంగా భావించే కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, దేశ శాంతి, అభివృద్ధి కోసం ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య మంత్రికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకట్రావు ఆలయ సంప్రదాయం ప్రకారం శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికగా శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. సింహాచలం ఆలయ ఆధ్యాత్మిక వైభవం, శతాబ్దాల చరిత్ర, ఆలయ సంప్రదాయాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని మంత్రి గోకులానంద మల్లిక్ పేర్కొన్నట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి. దర్శనం సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హెచ్పీవీ వ్యాక్సిన్‌తోనే సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణ

**500 మంది పోలీసు పిల్లలకు ఉచిత సెర్వావ్యాక్ టీకాలు -- పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ**




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, జూలై 11:** హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్పీవీ) వల్ల మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్‌ను హెచ్పీవీ (సెర్వావ్యాక్) వ్యాక్సిన్ ద్వారా సమర్థవంతంగా నియంత్రించవచ్చని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు.

నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ బ్యారక్స్‌లోని టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్‌లో శనివారం నిర్వహించిన హెచ్పీవీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ కలిసి ప్రారంభించారు.

రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో 9 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల 500 మంది పోలీసు సిబ్బంది కుమార్తెలకు ఉచితంగా హెచ్పీవీ వ్యాక్సిన్ బూస్టర్ డోసు అందించనున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీసు కుటుంబాల ఆడపిల్లల ఆరోగ్య రక్షణ కోసం ముందుకొచ్చిన సేవా సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. తొలి డోసు వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని, బూస్టర్ డోసు కూడా సురక్షితమేనని చెప్పారు. వ్యాక్సిన్ అనంతరం స్వల్ప జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాక్సిన్ వల్ల భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ, 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు రెండు డోసులు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారికి మూడు డోసుల వ్యాక్సిన్ అవసరమని వివరించారు. పోలీసు మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు అక్టోబర్ నెలలో ప్రత్యేక శిబిరం నిర్వహించాలని పోలీస్ కమిషనర్‌ను కోరారు. సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ రెండూ ప్రమాదకరమైన వ్యాధులని, వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ పాపారావు, ఏడీసీపీ (అడ్మిన్) రామచంద్రరావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి బి. రవిచంద్ర, డాక్టర్ సత్యవేణి, చైతన్య స్రవంతి ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్, అవినీస్, సీరం ఇన్‌స్టిట్యూట్ ఏరియా మేనేజర్ రాం రతన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు పోలీస్ కమిషనర్‌ను డాక్టర్ షిరీన్ రహమాన్ ఘనంగా సన్మానించారు.

## లంబసింగిలో సచివాలయంలో సర్ ప్రక్రియను పరిశీలించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం వి వి ప్రసాద్.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 11.**
చింతపల్లి మండలం, లంబసింగిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ )కార్యక్రమంలో భాగంగా లంబసింగి సచివాలయాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ శ్రీ ఎం.వి.వి. ప్రసాద్ సందర్శించారు.

ఈ సందర్భంగా ఓటర్లకు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి సంబంధిత బి ఎల్ ఓ లకు తిరిగి సమర్పించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ధృవీకరించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా పారదర్శకంగా, సమర్థవంతంగా సర్ ప్రక్రియ అమలు కావాలని సూచించారు.

అలాగే ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో పూర్తి చేసి బి ఎల్ ఓ లకు అందజేసి ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు బేరా సత్యనారాయణ, మాజీ ఎం.పి.టి.సి పొత్తు రామ్మూర్తి, పార్టీ నాయకులు బోనంగి సోమలింగపాడల్, బోనం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### 1/70 చట్ట పరిరక్షణకు దుచ్చరపాలెం గ్రామస్తుల 'లక్ష' విరాళం

- గిరిజన హక్కుల కోసం ఏకతాటిపై గ్రామం
- ఉద్యమానికి ఆర్థిక అండగా ప్రజల స్వచ్ఛంద సహకారం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 11:** గిరిజన ప్రాంతాల భూములు, హక్కులను కాపాడే చారిత్రాత్మక 1/70 భూ బదలాయింపు నిరోధక చట్టం పరిరక్షణ కోసం దుచ్చరపాలెం గ్రామస్తులు విశేష ఐకమత్యాన్ని చాటారు. చట్టాన్ని రక్షించుకోవడం ప్రతి గిరిజనుడి బాధ్యత అనే సంకల్పంతో గ్రామంలోని ఆదివాసీలు, యువత, పెద్దలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళాన్ని సేకరించి అందజేయడానికి సిద్ధమయ్యారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించే 1/70 చట్టంపై ఇటీవలి కాలంలో జరుగుతున్న వివిధ ప్రచారాలు, పరిణామాల నేపథ్యంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చట్ట పరిరక్షణ కోసం అవసరమైన న్యాయపోరాటాలు, ప్రజా ఉద్యమాలకు తమ వంతు మద్దతు అందించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.గ్రామంలోని ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా స్పందించి, తమకు తోచిన మేర విరాళాలు అందించడంతో కొద్ది రోజుల్లోనే లక్ష రూపాయలు సమీకరించారు. ఈ నిధిని గ్రామ పెద్దల సమక్షంలో 1/70 చట్ట పరిరక్షణ కమిటీ ప్రతినిధులకు అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.హక్కుల పరిరక్షణ కోసం ఆర్థికంగా కూడా ముందుకు వచ్చిన దుచ్చరపాలెం గ్రామస్తుల చొరవను పలువురు గిరిజన నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందించారు. ఈ స్ఫూర్తిదాయక నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. "చట్టాల పరిరక్షణతోనే గిరిజనుల మనుగడ, భూముల భద్రత సాధ్యమవుతుంది. భవిష్యత్తులో కూడా గిరిజన హక్కుల కోసం జరిగే ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి మేము అండగా ఉంటాం" అని గ్రామస్తులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సాగిన రామరాజు పడాల్, మాజీ సర్పంచ్ సాగిన పుష్పకుమారి, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు సాగిన భీమేశ్వర్ పడాల్, లక్ష్మణ్ బ్రదర్స్, కృష్ణ పడాల్, బ్రహ్మాజీ, గోపి, సోమరాజు, గుమ్మల రాంబాబు, వార్డు సభ్యుడు జోగి పడాల్తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## టిడిపి ఇన్చార్జ్ మార్పుపై పాడేరులో ప్రత్యేక సమావేశం

మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు "కాకూరు చంద్రరావు"



**కొయ్యూరు, పెన్ పవర్ జూలై 11:** తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి మార్పుపై పాడేరులో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కాకూరి చంద్రరావు అన్నారు. శనివారం మండలంలో టిడిపి మండల పార్టీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా చంద్ర రావు మాట్లాడుతూ మండలంలో 33 పంచాయతీలో ఎస్ఐ ఆర్ పై విస్తృత స్థాయిలో చర్చించడం జరిగిందన్నారు. అలాగే పాడేరులో నిర్వహించే సమావేశానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పాడేరు ప్రోటోకాల్ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ గ్రీష్మ, జోనల్ ఇన్చార్జి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి,, అరకు పార్లమెంటు అధ్యక్షురాలు తేజవతి పాల్గొంటారని తెలిపారు ఈ సమావేశానికి మండలంలో ఉన్న మాజీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీటీసీలు మాజీ జడ్పిటిసిలు సర్పంచులు మండల అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు బూత్ కన్వీనర్లు సీనియర్ నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి- సీఐ బి. సింహాచలం.




**చింతపల్లి పెన్ పవర్ జూలై 11.**
ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చింతపల్లి సీఐ బి సింహాచలం అన్నారు. సోమవారం మండలంలోని చిన్న గెడ్డ గ్రామంలోఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ఆయన నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు యువత వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. దీనివల్ల కుటుంబాలు చిన్నాభిన్నమై రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. మహిళల భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని ప్రతి ఒక్కరు విధిగా శిరస్త్రాణం ( హెల్మెట్) ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానాలతో పాటు, శిక్ష కూడే పడే అవకాశం ఉందన్నారు.అలాగే యువత రేష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ వంటివి చేయకూడదన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. మైనర్ వ్యక్తులకు వాహనాలు ఇవ్వకూడదని ప్రమాదాలు సంభవిస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. అనుమానస్పద కార్యక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ ఎప్పుడు ముందుంటుందన్నారు. మారుమూల ప్రాంతాలలో కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను మున్ముందు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వీరబాబు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా సర్ సర్వే పూర్తి చేయాలి

**సీలేరు, దుప్పులవాడ, ధారకొండ సచివాలయాల్లో సమీక్ష నిర్వహించిన వైసీపీ నాయకులు**



**గూడెం కొత్త వీధి పెన్ పవర్,జూలై 11:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం సీలేరు, దుప్పులవాడ, ధారకొండ సచివాలయాల్లో జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి పాల్గొని ఆయా ప్రాంతాల బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు)తో కలిసి ఎస్ఐఆర్ సర్వే పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా పలు పంచాయతీలలో నిర్వహించిన గ్రామసభలకు హాజరైన నాయకులు ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, ప్రాధాన్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు తప్పకుండా జాబితాలో ఉండేలా చూడాలని, ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు.అనంతరం పార్టీకి చెందిన బీఎల్ఏలకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఆయా సచివాలయాల పరిధిలో సుమారు 85 శాతం సర్వే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి బీఎల్ఏతో పాటు పార్టీ నాయకులపై ఉందని పేర్కొన్నారు.ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకుని ఇప్పటివరకు బీఎల్ఓలకు తిరిగి అందజేయని వారు వెంటనే వాటిని సమర్పించాలని కోరారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు వంటి వివరాలను బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ సరిచేసి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి వైస్ ఎంపీపీ లోత దేముడు, సీలేరు ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సీలేరు మాజీ సర్పంచ్ పాంగి దుర్గ్, దుప్పులవాడ మాజీ సర్పంచ్ కేలేబు కుమారి, ధారకొండ మాజీ సర్పంచ్ నడిగట్ల రాజు, ధారకొండ ఎంపీటీసీ మాడి రామన్న, మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొర్ర రాంబాబు, సీలేరు పంచాయతీ పార్టీ అధ్యక్షుడు పేలూరి సత్యనారాయణ, ధారకొండ పార్టీ అధ్యక్షుడు పిల్ల బుజ్జి, జర్రెల పంచాయతీ పార్టీ అధ్యక్షుడు కరణం గోపాలకృష్ణ, బీఎల్ఏలు గణేష్, వెంకటరావు, బాపూజీ, విభీషణ్, చిట్టినాయుడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 13న అన్నవరంలో మీకోసం కార్యక్రమం.

ఎంపీడీవో సిహెచ్. సీతామహాలక్ష్మి.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 11.** మండలంలోని అన్నవరం గ్రామపంచాయతీ నందు ఈ నెల 13న మీకోసం ( పీజిఆర్ఎస్ ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్ సీతామాలక్ష్మి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి తగిన ఏర్పాట్లను చేయవలసిందిగా పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. అన్నవరం పంచాయతీ ప్రజలందరూ మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని హామీ ఈ సందర్భంగా కోరారు.

## కూటమి నాయకులకు సమాచారం ఇవ్వకుండా బోరు శంకుస్థాపన చేయడం దురదృష్టకరం

**జీకే వీధి మండల టీడీపీ అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని సిగ్నపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.50 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టిన తాగునీటి బోరు పనులకు సంబంధించి అధికారులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉందని జీకే వీధి మండల టీడీపీ అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు ఆరోపించారు.ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు బోరు తవ్వకాలు ప్రారంభించే ముందు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పీసా కమిటీ ప్రతినిధుల సమక్షంలో శంకుస్థాపన నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అయితే సంబంధిత ఇంజినీరింగ్ శాఖ డీఈఈలు, జేఈఈలు, పంచాయతీ కార్యదర్శి కూటమి నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వైసీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలోనే శంకుస్థాపన నిర్వహించడం వెనుక ఉన్న కారణాలను అధికారులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.కూటమి నాయకులను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టి, ఒకే రాజకీయ పార్టీకి చెందిన నాయకులను మాత్రమే కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ప్రభుత్వ యంత్రాంగం నిష్పాక్షికతపై అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఈ విషయాన్ని సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని హెచ్చరించారు.దామనపల్లి పంచాయతీలో గతంలో ఎన్నో సంవత్సరాలు ప్రజాప్రతినిధులుగా పనిచేసిన నాయకులు గ్రామంలోని తాగునీటి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తర్వాత ఆ పనులను తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు.అదేవిధంగా సంకడ పంచాయతీలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని, అక్కడ కూడా కూటమి నాయకులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నించారని, గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితి మారిందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ పంచాయతీలకు అవసరమైన నిధులు విడుదల చేస్తోందని, అలాంటి అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం తగదని పోత్తూరు కొండలరావు అన్నారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

- జస్టిస్ అలపాటి గిరిధర్‌కు సింహాచలంలో ఆలయ మర్యాదలు
- శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



**సింహాచలం, పెన్ పవర్, జూలై 11 :**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవనీయ న్యాయమూర్తి జస్టిస్ అలపాటి గిరిధర్ శనివారం తన సతీమణి, కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సింహాచలాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆలయ అధికారులు, వేద పండితులతో కలిసి సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. నాదస్వర మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ మర్యాదలతో స్వాగతించి గర్భాలయానికి తీసుకువెళ్లారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం జస్టిస్ అలపాటి గిరిధర్ ఆలయంలో విశేష ప్రాధాన్యం కలిగిన కప్ప స్తంభాన్ని భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడా మండపంలో ప్రదక్షిణలు నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదోక్తంగా ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను సమర్పించారు. దర్శనం అనంతరం దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకట్రావు న్యాయమూర్తిని శేషవస్త్రంతో సత్కరించి, శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఆలయ ప్రసాదాలను కూడా అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరావు, ప్రధాన అర్చకులు, వేద పండితులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. న్యాయమూర్తి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు కూడా న్యాయమూర్తికి స్వాగతం పలికి, స్వామివారి ఆశీస్సులు పొందడం విశేషంగా నిలిచింది.


# శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద మహోత్సవం



భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన ప్రభుత్వ విప్ గణబాబు

భక్తులతో కలిసి పంక్తి భోజనంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 11 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గం 89వ వార్డు కొత్తపాలెంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రథమ వార్షిక అన్నప్రసాద వితరణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముందుగా ఆలయానికి చేరుకున్న గణబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించగా, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమం అనంతరం సామాన్య భక్తులతో కలిసి పంక్తిలో కూర్చుని ఆలయ ప్రసాదాన్ని స్వీకరించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ "అన్నదానం అన్నింటికంటే మహాదానం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి ప్రతీక. ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సత్సంకల్పాలను పెంపొందిస్తాయి. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు అభినందనీయులు" అని పేర్కొన్నారు. అన్నప్రసాద వితరణను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో విజయవంతంగా నిర్వహించిన ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, సేవాదారులను ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గణబాబు చూపిన సేవాభావాన్ని ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, బొడ్డేటి విజయ్, పెప్సీ రమణ, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.




## రాజేంద్రపాలెం పిహెచ్సిలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ...!



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 11:** మండలంలోని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా వైద్యాధికారి జగదీష్ నాయక్ సిహెచ్ఓ ప్రశాంత్ కుమార్ పాల్గొని ప్రజలకు కుటుంబ నియంత్రణ మాతా శిశు ఆరోగ్యం చిన్న కుటుంబం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పెరుగుతున్న జనాభాను సమతుల్యంగా నియంత్రించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి భాగ్యవతి, విద్యార్థులు ప్లే కార్డులు పట్టుకొని ర్యాలీ చేశారు.

## సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం జూన్ 11 పెన్ పవర్.**
కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నాడు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి లబ్ధిదారులకు అందజేశారు.గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన ఆవాల నందిని (చైల్డ్),తండ్రి ఆవాల రామకృష్ణకు రూ.40,000 విలువైన చెక్కును,జియ్యమ్మవలస మండలం ఎం.అల్లువాడ గ్రామానికి చెందిన సీమల భార్గవరావుకు రూ.35,000 విలువైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,అవసరమైన వారికి సత్వర ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా అనేక మంది పేద కుటుంబాలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం మెరుగైన వైద్యం పొందుతున్నాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు,మంత్రి నారా లోకేష్ సహకారంతో కురుపాం నియోజకవర్గానికి అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరయ్యేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.కష్టాల్లో ఉన్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి,జియ్యమ్మవస ఎంపీపీలు ఉరిటి రామారావు,బొంగు సురేష్,రాష్ట్ర నాటకరంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు,కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి,రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో,అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు,నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి,కురుపాం,జియ్యమ్మవలస మండల కన్వీనర్లు కె.వి.కొండయ్య, జోగి భుంజగరావు,బి.జె.పురం పిఎసిఎస్ చైర్మన్ సోములు మష్టార్,ఎంపీటీసీ సభ్యులు సింహాచలం,మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు,మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి,క్లస్టర్ ఇన్చార్జ్ దాసు,కూటమి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న విజయనగరం జాయింట్ కలెక్టర్

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు
- వేద ఆశీర్వచనం, శేషవస్త్రంతో సత్కరించిన దేవస్థానం

**సింహాచలం, పెన్ పవర్, జూలై 11 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానాన్ని శనివారం విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సేదు మాధవన్, గిరిజన సహకార సంస్థ వైస్ చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్.శోభిక దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని దివ్య ఆశీస్సులు పొందారు. ఆలయానికి చేరుకున్న విశిష్ట అతిథులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం సేదు మాధవన్ దంపతులు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని గర్భాలయంలో శ్రీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన సమయంలో ఆలయ అర్చకులు, అధికారులు వారికి ఆలయ విశిష్టత, సంప్రదాయాల గురించి వివరించారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య జాయింట్ కలెక్టర్ దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు, ప్రసాదం, జ్ఞాపికగా శ్రీ



స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. దేవస్థాన అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది విశిష్ట అతిథులకు సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలు నిర్వహించారు. దర్శన కార్యక్రమం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగగా, కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందిన సేదు మాధవన్ దంపతులు దేవస్థానం కల్పించిన ఏర్పాట్లను అభినందించారు. ఆలయంలో భక్తులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు దేవస్థాన వర్గాలు తెలిపాయి.

## 100 కిలోల గంజాయి స్వాధీనం

- గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్.
- జి మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఎస్ఐ పి నాని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 11.**ఒడిస్సా రాష్ట్రం నుండి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను ముంచంగిపుట్టు పోలీసులు లబ్బూరు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుండి సుమారు రూ. 50 లక్షల విలువైన 100 కిలోల పొడి గంజాయిని మరియు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు అన్నారు. శనివారం ముంచంగిపుట్టు ఎస్ఐకి అందిన నమ్మకమైన సమాచారంతో ఎస్ఐ నాని తన సిబ్బందితో కలిసి లబ్బూరు గ్రామ జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒడిస్సా వైపు నుండి వస్తున్న నిందితులను ఆపి తనిఖీ చేయగా, వారి వద్ద 3 ప్లాస్టిక్ ప్యాకెట్లలో గుట్టుచప్పుడు కాకుండా దాచి ఉంచిన 100 కిలోల గంజాయి దొరికిందని సిఐ తెలిపారు. గంజాయి నిందితులను విచారించి కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు



సీఐ తెలిపారు.

## సింహాద్రి అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

- భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈవో జల్లేపల్లి వెంకట్రావు



**సింహాచలం, పెన్ పవర్, జూలై 11 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రమైన సింహాచలంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో పాటు సింహాద్రి అప్పన్నపై ఉన్న అపార భక్తి విశ్వాసంతో ఆంధ్రప్రదేశ్తో పాటు తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు స్వయంగా ఆలయ పరిసరాలను పరిశీలించారు. క్యూ లైన్ల నిర్వహణ, ప్రసాదాల పంపిణీ, ఆన్లైన్ దర్శన టికెట్ల అమలు, భక్తుల రాకపోకలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, "సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకోవడం దేవస్థానం ప్రధాన లక్ష్యం. అందుకు అనుగుణంగా అన్ని విభాగాల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం" అని తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు చల్లని తాగునీరు, మజ్జిగను అందించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబుతో కలిసి ఈవో వాటర్ కూలర్ల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు. దేవస్థానం ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు ప్రతి కేంద్రంలో భక్తులకు మార్గదర్శనం చేస్తూ క్యూలైన్లను క్రమబద్ధంగా నిర్వహించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ దర్శనం సజావుగా కొనసాగేలా సేవలందించారు. ఆలయ ప్రాంగణంలో భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తులకు భక్తి భావాన్ని పెంపొందించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో దర్శనానికి వచ్చిన భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని సింహాద్రి అప్పన్న అనుగ్రహాన్ని పొందారు. దేవస్థానం చేపట్టిన సమర్థవంతమైన ఏర్పాట్లతో భారీ రద్దీ ఉన్నప్పటికీ దర్శన కార్యక్రమం సజావుగా సాగింది. భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడంతో దర్శనం ప్రశాంతంగా పూర్తయింది.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు






**గాజువాక: పెన్ పవర్, జులై 11:**జివియంసి 65 వ వార్డు బానోజీ తోట వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ. కూర్మ జయంతి సందర్భంగా ఆలయంలో కూర్మాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిట్టన అప్పల రెడ్డి, లక్ష్మిల మనవడు పారిష్ కిషోన్ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు గణేష్ కుమార్, వందన ప్రియ ,బుధ రమణ పుట్టినరోజు సందర్భంగా బీశెట్టి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. .ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూర్మావతారం స్థిరత్వం, సహనం, విశ్వ సమతుల్యతకు ప్రతీక. పరమ పవిత్రమైన కూర్మ జయంతి రోజున శ్రీహరి కూర్మావతార మంత్రాలను పఠించడం, విష్ణువును పూజించడం ద్వారా సకల పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు. యోగమాయ కూర్మదేవునితో నివసిస్తుందనే విశ్వాసం కారణంగా, నూతన గృహ నిర్మాణ పనులను ప్రారంభించడానికి, కొత్త ఇంట్లోకి మారడానికి, వాస్తు సంబంధిత పనులకు కూడా కూర్మ జయంతి రోజును శుభప్రదంగా భావిస్తారు అని అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్తులూరి నాగరాజు, చంద్రకళ, పెంటకోట రాజు,జానకి, ఆదిలక్ష్మి, పాండురంగ జయరాజ్,బి. వెంకటేష్, మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రాంతం ప్రపంచ జనాభా దినోత్సవం

**గాజువాక: పెన్ పవర్, జులై 11:**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ శ్రీనివాస్ మరియు డాక్టర్ బదరి నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. పిల్లల మధ్య సరైన ఎడమ పాటిద్దాం, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం, మంచి తల్లి, అందమైన కుటుంబం సమాజానికి అవసరమని, ప్రజలు గమనించాలని వైద్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఎమ్ పి హెచ్ ఈ ఓ బి హెచ్ ఎస్ ఈ అచ్యుత రావు , సూపర్వైజర్స్ రత్నాలు, గండేపల్లి రాము,ఎ ఎన్ ఎమ్ , అశా వర్కర్లు పాల్గొన్నారు.



# కొత్తవీధి గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు

- వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన".
- మెరుగైన తాగునీటి సౌకర్యాలే లక్ష్యమని కూటమి నాయకుల వెల్లడి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని కొత్తవీధి గ్రామంలో తాగునీటి సౌకర్యాల మెరుగుదల కోసం చేపట్టనున్న వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శనివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు, జనసేన నాయకులు గుండ్ల రఘువంశీ, అరడ కోటేశ్వరరావు, వనపల ఈశ్వరరావు, టీడీపీ బూత్ యూనిట్ ఇన్‌చార్జి మూర్ల భూపతి, జర్త సోమలింగం, వనపల లక్ష్మణ్‌తో పాటు గ్రామస్తులు, మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సమాచారం అడిగి తెలుసుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు.


- ఆర్టీఐతోనే పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం.
- ఘనంగా ప్రజా సంకల్ప వేదిక ఆత్మీయ సమ్మేళనం.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 11.** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ-2005) బ్రహ్మాస్త్రం లాంటిదని ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాంగి రాము అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీ పరిధిలో ప్రతి నెలా 11వ తేదీన ఆనవాయితీగా నిర్వహించే 'ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్' ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీవై పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి, న్యాయవాది కిల్లో రాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాంగి రాము మాట్లాడుతూ, హైకోర్టు న్యాయవాది మాదిరె రంగసాయి రెడ్డి, వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జక్కు నరసింహమూర్తి, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బంగారు రాజు, జిల్లా ఇన్‌ఛార్జి ఉల్లి తలుపులు తదితరుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆర్టీఐపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాధనం ఎలా ఖర్చవుతోంది? సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయి? అధికారుల పనితీరు తదితర విషయాలను తెలుసుకునే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికీ ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే బదులు ఆర్టీఐ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాచారం కోరడం అంటే ప్రభుత్వాన్ని విమర్శించడం కాదని, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై స్పష్టత అడగడమేనని రాము గుర్తుచేశారు. అవినీతిని అరికట్టడంలో ఈ చట్టం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సమాచారం అడగడం ప్రజల హక్కు అని, అడిగిన వెంటనే సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో జీకే వీధి, చింతపల్లి, జి.మాడుగుల, కొయ్యూరు, పెద్దబయలు మండలాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు పాంగి కృష్ణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గెమ్మెలి సోమరాజు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు తిమ్మూరు చిన్నబ్బాయి, నాయకులు కిల్లో వెంకటరావు, పాంగి పాల్స్, సుకుర్ చిన్నయ్య, సన్యాసిరావుతో పాటు పలువురు ఆర్టీఐ, హక్కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- కార్మికులందరికీ కనీస వేతనం 26వేలు తక్షణమే పెంచాలి.
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమ మహేశ్వరరావు.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 11.** వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ డైలీ వేజ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శనివారం ముంచింగిపుట్టు మండలం సిఐటియూ కమిటీ సమావేశం పి రవి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 30, 31 తేదీల్లో కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30న నాన్ పర్మినెంట్ కార్మికులతో 31న స్కీం వర్కర్లతో ధర్నా జరుగుతుందన్నారు. రోజు రోజుకు నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్న కార్మిక వేతనాలు పెరగడం లేదని అన్నారు. దీంతో కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ స్పందించి కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించేందుకు ప్రయత్నం చేయాలని, సీనియారిటీ ప్రాతిపదిక మీద కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లు అంగన్వాడి, ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఐకెపి వివో ఏ, మధ్యాహ్నం భోజనం కార్మికులకు ఇచ్చే కొద్దిపాటి వేతనాలు సరిపోవడం లేదని తెలిపారు. కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మండల కన్వీనర్ కే శంకర్రావు, బిల్డింగ్, శానిటేషన్ వర్కర్స్, అంగన్వాడి, ఆశ, మిడ్ డే మీల్స్ తదితర రంగాలు ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

# వీరవరం గ్రామంలో ఎస్ఐఆర్ ఓటరు ధృవీకరణ కార్యక్రమం

**మరణించిన వారి పేర్ల తొలగింపుపై గ్రామసభ నిర్వహణ**




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని వీరవరం గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం ఓటరు ధృవీకరణ (వెరిఫికేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, వీఆర్వో అచ్చిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామసభ ఏర్పాటు చేసి ఓటరు జాబితాలో నమోదైన వివరాలను పరిశీలించారు. మరణించిన వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేయడం, ఓటరు జాబితాలో ఉన్న ఇతర అభ్యంతరాలపై గ్రామస్థుల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు సరిగా నమోదయ్యాయో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్‌తో పాటు గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లాలో సర్ ప్రక్రియ గడువు పెంచాలి




**అల్లూరి జిల్లా ను ప్రత్యేక జోన్ గా ప్రభుత్వం గుర్తించాలి.**
**సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పల నర్సయ్య విజ్ఞప్తి.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 11.** అల్లూరి జిల్లాలో ఓటర్ల సవరణ ( సర్) కార్యక్రమం గడువు పెంచాలని, జిల్లాను ప్రత్యేక జోన్ గా గుర్తించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పల నరసయ్య ఎన్నికల కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె. నర్సయ్య అధ్యక్షతన సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్రత్యేక జోన్ గా తీసుకొని ఈ నెల 30 వరకు ఓట్ల వెరిఫికేషన్ సర్ గడువు పెంచాలని ఎన్నికల కమిషనర్ వారికి విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతమంతా ఒరిస్సా సరిహద్దు కావడంతో చాలా మంది మహిళలు పెళ్లి చేసుకుని ఉన్నారనీ, అటు ఒరిస్సా గాని ఇటు ఆంధ్ర గాని ఆదివాసి ప్రాంతాలు కావడంతో నిరక్షరాస్యులు ఎక్కువ మంది ఉండడంతో 2002 ఓటరు జాబితాలోఎక్కువ మందికి ఓటు లేకపోవడంతో ప్రత్యేక ఓట్ల వెరిఫికేషన్ సర్ లో చాలా ఎక్కువ ఓట్లు రద్దు అయ్యే అవకాశం ఉందని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఒడిశాలో ఓట్లు లేకపోతే మన ప్రాంతంలో ఏ విధంగా ఓటు కాపాడుకోవాలో ఈ రోజు వరకు అధికారులు స్పష్టంగా ప్రకటించలేదని, దీంతో చాలా ఓట్లు రద్దు అయి నష్టపోయే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ నెల 30 వరకు గడువు పెంచాలని, గిరిజన ప్రాంతానీ ప్రత్యేక జోన్ గా గుర్తించి అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు రద్దు కాకుండా చేసే బాధ్యత అధికారుల పై ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాధ్, మండల కమిటీ సభ్యులు జి.నారాయణ, వి.లైకోన్, కె.శంకర్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించకుంటే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సంకాడ పంచాయతీ పరిధిలోని పెద్దజడుమూరు గ్రామంలో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామ కమిటీ ప్రతినిధులు గ్రామస్తులకు ఎస్ఐఆర్ సర్వే ప్రాముఖ్యతను వివరించి, ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు కొనసాగకపోయే అవకాశం ఉందని, అనంతరం ఓటు హక్కు పునరుద్ధరణకు నిబంధనల ప్రకారం ప్రత్యేక ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోపు తమ వివరాలను సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన గడువు ఈ నెల 13వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటికీ ఫారాలు సమర్పించని వారు వెంటనే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి రాజుబాబు, బీఎల్ఓలు కైలాష్‌పతి, వరప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి మామిడి చంటిబాబు, బీఎల్ఏ సడ్డా బొజ్జిపడాల్, పీసా కార్యదర్శి ఊలం బాబురావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జీకే వీధి మండలంలో 56 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ గ్రామసభలు

**గైర్హాజరు ఓటర్లు, మరణాలు, శాశ్వత వలసలు, డూప్లికేట్ నమోదులపై పరిశీలన**




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధి మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల పరిధిలో శుక్రవారం, శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎస్ఐఆర్ సర్వే సందర్భంగా గుర్తించిన గైర్హాజరు (అబ్సెంట్) ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు, మరణించిన ఓటర్ల పేర్లు, డూప్లికేట్ ఓటరు నమోదులను గ్రామస్థుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ వివరాలపై గ్రామస్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, సంబంధిత ఆధారాలను సమర్పించాలని అధికారులు సూచించారు. గ్రామస్థులు సమర్పించిన అభ్యంతరాలు, ఆధారాలను పరిశీలించిన అనంతరం సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమ లాగిన్‌లో నమోదు చేసి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతారని అధికారులు తెలిపారు. గ్రామసభల నిర్వహణ తీరును అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ), తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు పరిశీలించారు. మండల అదనపు ఏఈఆర్ఓలుగా నియమితులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.ఆర్.ఆర్.సి., ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ, మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ), ఎంపీడీవో, పీడీ హౌసింగ్ తదితర అధికారులు గ్రామసభలకు హాజరై ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు.

# ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి భక్తుల వెల్లువ....







**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 11:** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని ప్రాచీన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి దేవస్థానం శనివారం భక్తజన సందోహంతో కళకళలాడింది. జూలై రెండో శనివారం సందర్భంగా తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమంలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ముందు భాగంలో శ్రీ మహావిష్ణువు, వెనుక భాగంలో జగన్మోహిని రూపంలో దర్శనమిచ్చే అరుదైన ఏకశిలా విగ్రహం ఈ ఆలయ ప్రత్యేకతగా నిలుస్తోంది. స్వామివారి రెండు పాదాల మధ్య నుంచి నిత్యం గంగాజలం ఉబికి వస్తుండటం ఈ క్షేత్ర మహిమాన్వితానికి ప్రతీకగా భక్తులు విశ్వసిస్తారు. ఈ విశిష్టత కారణంగానే ర్యాలి క్షేత్రం దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తోంది. ఐదు బుధవారాల వ్రతాన్ని ఆచరించే భక్తులకు జగన్మోహిని కేశవస్వామి కోరిన కోరికలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం రోజంతా గోవింద నామస్మరణలు, భక్తిగీతాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

సాయంత్రం ర్యాలి గ్రామానికి చెందిన లలితా పారాయణదారులు శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీ మణిద్వీప పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.
ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, నిత్యాన్నదానం తదితర ఏర్పాట్లు సమకూర్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.



# ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పొడిగించాలి.

-ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,జూలై 11:**కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు ఎం.ఎం. పల్లంరాజు ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీర్మానం ప్రకారం ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కార్యక్రమం ఈ నెల 14 వ తేదీతో ముగియనున్నందున, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా ఈ కార్యక్రమాన్ని ఈ నెల ముప్పై ఒకటో తేదీ వరకు పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఇంకా అనేక మంది ఓటర్లు తమ పేర్ల నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు, ఇతర అభ్యంతరాల దాఖలు వంటి ప్రక్రియలను పూర్తి చేయలేకపోయారన్నారు. వారికి తగిన సమయం కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఈ మేరకు భారత ప్రధాన ఎన్నికల సంఘానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, కాకినాడ జిల్లా ఎన్నికల అధికారికి, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ ఎన్నికల



సంఘం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు.అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితాకు దూరం కాకుండా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి దరఖాస్తుల స్వీకరణకు అదనపు గడువు కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు ధరాణాలకోట శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, పెద్దిరెడ్డి వీరబాబు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అర్హులైన ఏ ఒక్కరి ఓటు రుద్దు కాకుండా చూడవలసిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లదే.






-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ముద్రగడ బాలు,వాసిరెడ్డి జమీల్.

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 11:** అర్హులైన ఏ ఒక్కరి ఓటు రద్దు కాకుండా చూడవలసిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యత తీసుకోవాలని ముద్రగడ వీర రాఘవరావు,(బాలు), వాసిరెడ్డి జమీల్ అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు, ముద్రగడ వీర రాఘవరావు (బాలు) ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కన్వీనర్లకు,మండల బూత్ లెవెల్ ఇంచార్జిలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కాకినాడ జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు వాసిరెడ్డి జమీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సవరణ ప్రక్రియ త్వరలోనే ముగియనున్న నేపథ్యంలో, బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా రద్దు కాకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందని, దీనికోసం ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు.ఓటర్ల జాబితా సవరణ గడువు త్వరలో ముగుస్తున్నందున,ప్రతి బూత్ పరిధిలో ఓట్ల నమోదు మరియు మార్పులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ముద్రగడ బాలు, వాసిరెడ్డి జమీల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు రామిశెట్టి నాని, నరాల శ్రీను,చింతకాయల సత్యనారాయణ, గొల్లపల్లి కాశీ విశ్వనాధ్ తోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఏడువారాల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 11 :**ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ శనివారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో ఏడువారాల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయన ముందుగా ఆలయ మాడవీధుల్లో సంప్రదాయబద్ధంగా ఏడు ప్రదక్షిణల నోమును ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక అర్చనల్లో పాల్గొన్నారు.

దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శేఖర్ మాస్టర్‌కు ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు, ప్రసాదాలను అందించి సత్కరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు శేఖర్ మాస్టర్‌ను చూసేందుకు ఆసక్తి కనబరిచగా, పలువురు అభిమానులు ఆయనతో కలిసి ఫొటోలు దిగారు. శేఖర్ మాస్టర్ కూడా అభిమానులను ఆప్యాయంగా పలకరించారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు ఏపుగంటి సుబ్బారావు ,పాల్గొన్నారు. దర్శన ఏర్పాట్లను ఆలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించగా, శేఖర్ మాస్టర్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకుని ఆలయం నుంచి బయలుదేరారు.

## మహిళల భద్రతపై నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన





- శక్తి యాప్ వినియోగించాలి
- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- కాకినాడ జిల్లా పోలీసులు

**కాకినాడ, పెన్ పవర్, జూలై 11:**మహిళలు, బాలికల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు కాకినాడ శాంతినగర్‌లోని ఇమ్మానుయేలు స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా పోలీసులు నిర్వహించారు.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), ఇన్‌చార్జ్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.దుర్గాప్రసాద్ సూచనలతో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ అనూష ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 ఎమర్జెన్సీ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి మహిళ, బాలిక తమ మొబైల్‌లో శక్తి యాప్ తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని, అందులోని ఎస్ఓఎస్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. శక్తి యాప్ ద్వారా పోలీసులకు తక్షణ సమాచారం చేరి వేగంగా సహాయం అందించేందుకు వీలవుతుందని వివరించారు.మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, సైబర్ నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలు, వ్యక్తిగత భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం వల్ల సైబర్ నేరగాళ్లు వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అలాగే అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, వీడియో కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీ వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు లేదా బ్లాక్‌మెయిల్ వంటి సంఘటనలు ఎదురైతే భయపడకుండా వెంటనే 112కు కాల్ చేయాలని లేదా శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాలరాజు, శక్తి టీమ్ పోలీసులు పాల్గొన్నారు. సుమారు 70 మంది విద్యార్థులు, అధ్యాపకులు హాజరై పోలీసు అధికారులు అందించిన సూచనలను ఆసక్తిగా ఆలకించారు.

## మందపల్లి మందేశ్వర స్వామి ఆలయానికి ఒక్కరోజులో రూ.3.33 లక్షల ఆదాయం





**కొత్తపేట,పెన్ పవర్,జూలై 11:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ విశేషంగా కనిపించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల సేవలతో ఆలయానికి మొత్తం రూ.3,33,162 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్,కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు వెల్లడించారు.

ప్రత్యక్ష పూజల ద్వారా మొత్తం రూ.2,01,310 ఆదాయం లభించింది.ఇందులో ముఖమండప అభిషేకాలు 24 నిర్వహించగా రూ.16,800, ఏకాదశ రుద్ర తైలాభిషేకాలు 289 నిర్వహించగా రూ.72,250, మహాన్యాస పూర్వక తైలాభిషేకాలు 331 నిర్వహించగా రూ.57,925, తైలం సమర్పించి దర్శనం 254 మంది భక్తులు చేయగా రూ.20,320, తిలదానం ద్వారా రూ.550, స్వయం హోమాల ద్వారా రూ.2,400, స్వయం జపం ద్వారా రూ.2,500, కేశఖండన సేవల ద్వారా రూ.200 ఆదాయం లభించింది.అదనంగా ఫోన్‌పే (గూగూ) ద్వారా భక్తులు రూ.28,365 సమర్పించారు.అలాగే పరోక్ష పూజల ద్వారా రూ.81,100, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.50,752 ఆలయానికి అందాయి.ప్రత్యక్ష, పరోక్ష పూజలు, విరాళాల ద్వారా మొత్తం రూ.3,33,162 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

శనివారం కావడంతో శనేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించారు. స్వామివారి అనుగ్రహం కోసం భక్తులు తైలాభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు మాట్లాడుతూ,భక్తులు ఆలయ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానంలో నిత్యపూజలు,ప్రత్యేక సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని,భక్తులు ఆలయ నిబంధనలు పాటిస్తూ స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 11:** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, పెద్దాపురం డిఎస్పి తిలక్ ఆదేశాలతో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు, పోలీస్ సిబ్బంది గత వారం రోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 22 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎస్సై టి. రఘునాథరావు తెలిపారు. వారిలో 10మందికి 5 రోజుల జైలు శిక్ష, మరో 12 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.1.20లక్షలు, జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిందితులను పెద్దాపురం సబ్ జైలుకు తరలించారు. జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

# లోక్ అదాలత్ లో రాజీ తో శాశ్వత పరిష్కారం






**✷ జిల్లా డీఎల్ఎస్ఏ ఛైర్మన్ ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వేంకటేశ్వరరావు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 11:**ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రీతిలో కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ప్రత్యామ్నాయ వేదికని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ (ఎఫ్ఏసీ), ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వేంకటేశ్వరరావు అన్నారు. లోక్ అదాలత్‌ను ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహనతో పాటు న్యాయ వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.

శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహిం చిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సులభంగా పరిష్కరిం చుకునేందుకు లోక్ అదాలత్ సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు.

న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు సమిష్టిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించడం వల్ల ప్రజల్లో లోక్ అదాలత్‌పై నమ్మకం మరింత బలపడుతుందని చెప్పారు. ప్రజల్లో న్యాయపరమైన అంశాలపై పూర్తి అవగాహన లేక చిన్న చిన్న వివాదాలకూ కోర్టులను ఆశ్రయించడం వల్ల కేసులు పేరుకుపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం--1987 అమలులోకి వచ్చిందని, పేదలకు ఉచిత న్యాయసేవలు అందించడం, న్యాయ అవగాహన కల్పించడం, రాజీమార్గంలో వివాదాలను పరిష్కరించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యాలని వివరించారు. సాధారణ న్యాయ ప్రక్రియలో ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు కేసులు బదిలీ అవుతూ పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుందని, సమయం, ధనం రెండూ వృథా అవుతాయని అన్నారు. "రాజీమార్గమే రాజమార్గం" అనే స్ఫూర్తితో పనిచేసే లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల అంగీకారంతో ఒకే విడతలో కేసులు పరిష్కారమవుతాయని, , ఇరువర్గాలు సంతృప్తి చెందుతారని తెలిపారు.

గత మార్చి నెలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 14 వేల కేసులు పరిష్కారం అయ్యాయని గుర్తు చేశారు. ఈసారి కూడా ప్రజలు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరస్పర రాజీమార్గంలో తమ వివాదాలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 43 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయగా, రాజమ హేంద్రవరం జిల్లా కోర్టు ఆవరణలో 9 బెంచీల లో వివిధ కేసులను విచారించి రాజీమార్గంలో పరిష్కరించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వి. ప్రసాద్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలని 30 న ఛలో కలక్టరేట్ జయప్రదం చేయాలి



**రాజమహంద్రవరం, పెన్ పవర్, జూలై11 :**ఎపి గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్( సి ఐ టి యు) పిలుపు మేరకు దివాన్ చెరువు పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశం లో సీఐటీయూ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి బి. పూర్ణిమ రాజు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఎన్ ఎం ఆర్ గ్రీన్ అంబాసిడర్ లకు మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా జీతాలు చెల్లించాలని,132,142 జీ ఓ లు అమలు చేయాలని ప్రతీనెల 5వ తేదీలో పు జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం జరుగుతున్న ఛలో కలక్టరేట్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. మున్సిపల్ కార్మికుల మాదిరిగానే పంచాయతీ కార్మికుల్ను 4.30 గంటలకు పారిశుధ్య చేయడమే కాక, మంచినీరు, కరెంట్, పన్నులు వసూలు తదితర విధులు నిర్వహిస్తురన్నారు. పంచాయతీ కార్మికులు తిండికి కూడా నోచుకోక పస్తులతో గడుపు తున్నారని, రాష్ట్రం లో పాలకులు మారినా పంచాయతీ కార్మికుల జీవితాలు మారలేద న్నారు. 1999 లో గ్రామ పంచాయతీ కార్మికుల పోరాట ఫలితంగా జీ. ఓ.నెంబర్ 551 లో కనీస వేతనాలు చెల్లించా లని, గుర్తింపు కార్డులు, ఈ ఎస్ ఐ,ఈ పీ ఎఫ్, అమలు చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన జీ ఓ లు 132,142 పక్కా అమలు చేయాలని, కనీస వేతనం రూ. 26,000/- ఇవ్వాలని, గ్రాట్యుటీ పెన్షన్, సెలవులు అమలు చేయాలని, దహన సంస్కారాల కు రూ.20,000/- చెల్లించాలని , సాధారణ మృతికి 5 లక్షలు, ,ప్రమాద మృతికి 10 లక్షలు ఎక్స్ గ్రేషియ చెల్లించాలని కుటుంబ సభ్యులకు ఉద్యోగం,పక్కా ఇల్లు ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో జూలై 30 న ఉదయం 10 గంటలకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్దకు పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశం లో యూనియన్ అధ్యక్షుడు గణపతి,సతీష్, జ్యోతి,రామారావు, ప్రేమ్ కుమార్,ఆదినారాయణ,అయ్యప్ప,బ్రహ్మ రాజు,విజయ్ బ్రహ్మ రాజు,మంగ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బీఐ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం (సేవ) సేవలు ప్రశంసనీయం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,జూలై 11:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో నాయకత్వ శిక్షణా కార్యక్రమం శనివారం స్తానిక రిషితా గ్రాండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహార్ మాట్లాడుతూ, ఎస్బీఐలోని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. అదే సమయంలో సేవ అమరావతి సర్కిల్ ఉద్యోగుల సంక్షేమంతో పాటు సామాజిక సేవలను నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. బ్యాంకర్లు తమ వృత్తి బాధ్యతలతో పాటు దళితుల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాజ అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య వక్తగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్, కవి, ప్రముఖ వక్త ఎం. సతీష్ చంద్ర నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, జట్టు నిర్మాణం, బాధ్యతాయుత నాయకత్వం వంటి అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో సేవ జనరల్ సెక్రటరీ మేడికొండ సునీల్, అధ్యక్షులు కె. సతీష్, డీజీఎస్ బి. అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె. రాజశేఖర్ , వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు, , సభ్యులు పాల్గొన్నారు.

## సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జి ఎం సందీప్ మాథుర్ ను కలిసిన ఎం ఎల్ సి సోము



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 11:**నూతనంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ మాథుర్ శనివారం తూర్పు గోదావరి జిల్లా విచ్చేసి రాజమండ్రి, కొవ్వూరు, గోదావరి రైల్వే స్టేషన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎం ఎల్ సి సోము వీర్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర జనరల్ మేనేజర్ ను కలిశారు. రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలో పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని జనరల్ మేనేజర్ కు వినతి పత్రం అందించారు. ప్రజా ప్రయోజనాల కోసం కొవ్వూరు , గోదావరి రైల్వే స్టేషన్లో సింహాద్రి, సర్కార్, బొకారో అలెప్పి ఎక్స్ప్రెస్ రైళ్లు హాల్టింగ్స్ కల్పించాలని కోరారు. భీమవరం-నిడదవోలు మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లను రాజమండ్రి వరకూ పొడిగించాలని జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ ను సోము వీర్రాజు బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర కోరారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మాట్లాడుతూ, రైల్వే ట్రాక్ పై రైళ్ల ట్రాఫిక్ పెరగడం, వేగవంత రైళ్లు రావడం వంటి కారణాలచేత, ప్రయాణికుల సంఖ్య ప్రామాణికంగా కొన్ని హాల్టింగ్స్ తగ్గించామని తెలిపారు. పిక్కి నాగేంద్ర కలుగజేసుకుని ప్రయాణికుల ఇబ్బందులు, ప్రయోజనాలను, అవసరాలను, కొవ్వూరు ను దృష్టిలో ఉంచుకుని రైళ్ల హాల్టింగ్స్ ను ఉనరుద్ధరణ చేయాలని కోరారు. ప్రజా ప్రయోజనాల కోసం కోసం ఆలోచన చేస్తామని రైల్వే జనరల్ మేనేజర్ హామీ ఇచ్చారు.

## నగరంలో పుష్కరపనులను పరిశీలించిన మంత్రులు నారాయణ, దుర్గేష్



**ఆరు జిల్లాల్లో భక్తులకు భద్రత, మౌలిక వసతులపై దృష్టి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 11:**రాబోయే 2027 గోదావరి పుష్కరాలను ఆదర్శవం తమైన ఆధ్యాత్మిక మహోత్సవంగా నిర్వహిం చేందుకు కూటమి ప్రభుత్వం ఏడాది ముందు గానే సమగ్ర కార్యాచరణను ప్రారంభించిందనీ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో పుష్కరాలకు శాశ్వత మౌలిక వసతులను అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం నగరంలో పర్యటించి పుష్కరాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనకు ముందు స్థానిక హోటల్‌లో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. పుష్కరాల మాస్టర్ ప్లాన్, కేంద్ర ప్రభుత్వ సహకారం, నిధుల కేటాయింపు, శాఖల సమన్వయంపైచర్చించారు. అనంతరం కోటిలింగాల ఘాట్, పుష్కర్ ఘాట్లను సందర్శించి అభివృద్ధి పనులను నడక మార్గం లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసారు. అనంతరం ఆర్ ఎమ్ సి కార్యాలయంలో అధికారుల సమీక్ష నిర్వహించి, గోదావరి రివర్ ఫ్రంట్, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, నగరంలోని డ్రైనేజీ, సివరేజ్ వ్యవస్థల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు.

మంత్రి డా. పొంగూరు నారాయణ మాట్లాడుతూ, 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేం దుకు ప్రభుత్వం సిద్ధమవు తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించి అన్ని శాఖలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.585 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిధులతో ప్రధాన రహదారులు, డ్రైనేజీ, సివరేజ్, తాగునీటి సరఫరా, పారిశుధ్య వ్యవస్థలను ఆధునికీకరిస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ,

ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. గతంలో జరిగిన లోపాలను పునరావృతం కాకుండా భద్రతా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్టు ద్వారా గోదావరి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

భక్తుల కోసం హోమ్ స్టేలు, టెంట్ సిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. .

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ పోలవరం అథారిటీతో చర్చించి లెఫ్ట్ మెయిన్ కెనాల్ అభివృద్ధికి రూ.250 కోట్ల నిధుల సమీకరణకు ప్రయత్నాలు జరుగు తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాల తొలి దశ పనులకు రూ.580 కోట్ల నిధుల కేటాయింపు నిర్ణయమన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి రూ.100 కోట్ల నిధులు మంజూర య్యాయని, రూ.100 కోట్ల వ్యయంతో 'అఖండ గోదావరి' పనులు జరుగుతున్నాయని చెప్పారు. విద్యుత్ పనులకు రూ.50 కోట్లు, రివర్ ఫ్రంట్‌కు రూ.22 కోట్లు, అమృత్-2.0 కింద రూ.95 కోట్లు, ఖేలో ఇండియా పథకం కింద రూ.14 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ , ధవళేశ్వరం నుంచి వెంకటనగరం వరకు ఉన్న అన్ని ఘాట్ల అభివృద్ధికి నిధులు కేటాయించ నున్నట్లు తెలిపారు. అంతకు ముందు మంత్రి నారాయణ కు జిల్లా మంత్రి కందుల దుర్గేష్ స్వాగతం పలికి, మెమంటో అందచేశారు. ఈ పర్యటనలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ క్షితిజ్ ఆదిత్య శర్మ, ఇరిగేషన్ ఎస్.ఈ. జి. శ్రీనివాసరావు, టూరిజం రీజినల్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## తెదేపా కార్యాలయం వద్ద గ్రీవెన్స్,క్యాడర్ మీటింగ్..






**రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి..**

**కోరుకొండ, పెన్ పవర్, జూలై 11:** రాజానగరం నియోజకవర్గం బూరుగుపూడి గేట్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం గ్రీవెన్స్ మరియు క్యాడర్ మీటింగ్ లో రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన బొడ్డు వెంకటరమణ చౌదరి వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను శ్రద్ధగా విని,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని,గ్రామ స్థాయి నుంచి ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని,వాటి పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి,ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.

నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంతో పనిచేస్తే రాజానగరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటే కేశ్వర రావు,తనకాల నాగేశ్వరరావు, అడపా వీరబాబు, తెలగంశెట్టి శ్రీను,రొంగల శ్రీను, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్తు,పెద్ద టాన్స్ఫరం,ఓల్టేజీ,ది,వేయాలి.



**-ఉమ్మడివరం గ్రామస్థులు,యువకులు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.11:**మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి రాత్రివేళ పది,పదకొండు,గంటలకు,విద్యుత్తుతరచూపోతుం దని, విద్యుత్తులేక,పోవడంతో నానా ఇబ్బందులు పడుతు న్నామని,ఉమ్మడివరం గ్రామస్థులు ఆరోపించారు. విద్యుత్తు,టాన్స్ఫరం,ఓల్టేజీ,సరిగ్గా సరఫరా చేయక పోవడంతోఈసమస్య,ఎదురుఅవుతుందని,వెంటనే పెద్ద విద్యుత్తు,టాన్స్ఫరం,ఏర్పాటు చేయాలని,కోరారు. ఉమ్మ డివరం గ్రామంలోవిద్యుత్తు సరిగ్గా లేకపోవడంతో,దోమ లు,కారణంగా ప్రజలకు డెంగ్యూ,(మలేరియా)జ్వరాలు ఎక్కువ వస్తున్నాయని,దీనికి నిదర్శనం,రెండు,మూడు రోజుల క్రితం ప్రజలకువచ్చిన డెంగ్యూ,జ్వరాలపై,సంబం ధిత,అధికారులు తగుచర్యలు చేపట్టారని,విద్యుత్తు టాన్స్ఫరం,ఓల్టేజీ,పైవిద్యుత్తు శాఖవారు తగుచర్యలు చేపట్టి,పెద్దటాన్స్ఫరం,వేయాలని,ఉమ్మడివరం గ్రామస్థులు కోరుతున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com